కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమ్ - భావార్థముతో.



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

పూర్వాంగం

శివుడు లయ కారకుడు. అంటే సృష్టిని విలీనం చేసుకొని కొత్త సృష్టికి మార్గాన్ని కల్పిస్తాడు. జ్ఞానంపై ఆసక్తి లేనివాళ్లను మళ్లీ జన్మ ఉండేటట్లుగా లయం చేయడం, జ్ఞానం కోరేవాడికి జ్ఞానాన్ని ప్రసాదించి మళ్లీ జన్మ లేకుండా భగవంతుని స్వరూపంలో కలపడం అనే రెండు రకాలుగా శివుడు లయం చేస్తాడు. శివుని యొక్క జ్ఞానావతారమే దక్షిణామూర్తి.

దక్షిణామూర్తి పరమశివుని జ్ఞానగురువు అవతారం. ఇతర గురువులు మాటలతో శిష్యులకు బోధిస్తారు. కానీ దక్షిణామూర్తి మౌనం గానే ఉండి శిష్యులకు కలిగే సందేహాలు నివారిస్తాడు.

బ్రహ్మదేవుడు తన సృష్టిని ప్రారంభించినప్పుడు మొదట సనక, సనందన, సనత్సుజాత మరియు సనత్కుమారులను సృష్టించాడు. వారిని తన సృష్టిని కొనసాగించమన్నాడు. కాని వారికి ఇష్టం లేక మేము బ్రహ్మజ్ఞానం పొందాలి. అందువలన మేము మీకు సాయపడలేము అని విరక్తులై బ్రహ్మజ్ఞానాన్ని పొందడానికి గురువును వెదుకుతూ బయలుదేరారు. ఇక బ్రహ్మగారు మరో ప్రత్యామ్నాయంతో తన సృష్టిని కొనసాగించాడు.

ఇక ఈ నలుగురూ గురువు కోసం వెదుకుతూ నారద మహర్షి సహాయంతో మొదట బ్రహ్మ గారినే అడుగుదామనుకొన్నారు. కాని ప్రక్కన సరస్వతీదేవిని చూసి "ఈయనే పెళ్ళి చేసుకొని సంసారంలో ఉన్నాడు. ఇక ఈయన మనకు ఏమని ఉపదేశిస్తాడు" అని అనుకొని బ్రహ్మను అడుగలేదు. అలాగే మహావిష్ణువునూ మరియు పరమశివుడినీ కూడా అడుగుదామని వెళ్ళి వారి ప్రక్కన లక్ష్మీదేవినీ మరియు పార్వతీదేవినీ చూసి వారిని కూడా అడుగలేదు.

పరమశివుడు ఈ నలుగురి అజ్ఞానాన్ని చూసి బాధపడి వారికి బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించాలని అనుకొన్నాడు. అలా అనుకున్న పరమేశ్వరుడు వారు వెళ్ళే దారిలో ఒక మర్రిచెట్టు క్రింద దక్షిణా మూర్తిగా కూర్చున్నాడు.

11వ పేజీ చూడుము.

శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమ్ - భావార్థముతో.

శాంతిపాఠం: ఓం యో బ్రహ్మాణం విదధాతి పూర్వం
యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై।
తంహదేవమాత్మ బుద్ధిప్రకాశం
ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే॥

ధ్యానమ్:

01. మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వం యువానమ్
వర్షిష్ఠాన్తే వసదృషిగణై రావృతం బ్రహ్మనిష్ఠైః।
ఆచార్యేంద్రం కరకలిత చిన్ముద్ర మానందమూర్తిం(రూపం)
స్వా(త్మ)త్మారామం ముదిత వదనం దక్షిణామూర్తి మీడే॥

(ఆత్మనిష్ఠుడై ప్రసన్నవదనంతో మౌనంగా చిన్ముద్రాంచిత హస్తంతో, వేదవిదులైన మహర్షులకు ఆత్మవిద్యను భోదిస్తున్న యువగురువు శ్రీ దక్షిణమూర్తిని నేను ఆరాధిస్తాను.)

మౌనముగా చేయబడిన వ్యాఖ్యానముతో స్పష్టముచేయబడిన పరబ్రహ్మ స్వరూపము కలిగి బ్రహ్మనిష్ఠుడై ప్రసన్నవదనంతో మౌనంగా చిన్ముద్రాంచిత హస్తంతో, వృద్ధులైన మహర్షులకు ఆత్మవిద్యను బోధిస్తున్న యువగురువు శ్రీ దక్షిణామూర్తిని నేను ఆరాధిస్తాను.

మౌన వ్యాఖ్య చేత వెల్లడించబడే పరబ్రహ్మ స్వరూపుడూ, యువకుడు, బ్రహ్మనిష్ఠులై వృద్ధ శిష్యులైన ఋషి గణాలచేత పరివేష్టింపబడిన ఆచార్య శ్రేష్ఠుడు, చిన్ముద్రాంచిత కరకమలములతో ఆనంద స్వరూపుడు, ఆత్మానందము ననుభవిస్తూ ప్రశాంత వదనముతో ఉన్న సద్గురువు శ్రీ దక్షిణామూర్తిని స్తోత్రము చేయు చున్నాను.

02. వటవిటపి సమీపే భూమిభాగే నిషణ్ణం
సకలముని జనానాం జ్ఞానదాతార మారాత్।
త్రిభువనగురు మీశం దక్షిణామూర్తి దేవం
జనన మరణ దుఃఖచ్ఛేద దక్షం నమామి॥

(మఱ్ఱిచెట్టు క్రింద కూర్చొని తనచుట్టూ ఉన్న మహర్షులకు ఆత్మవిద్యను అందిస్తూ జనన మరణాలతో కూడిన సంసారదుఃఖాలను నిర్మూలిస్తూ ముల్లోకాల చేతనూ గురువుగా కొలువబడే శ్రీ దక్షిణామూర్తికి నమస్కృతులు.)

మఱ్ఱిచెట్టు క్రింద కూర్చొని తనచుట్టూ ఉన్న మహర్షులకు బ్రహ్మవిద్యను అందిస్తూ జనన మరణాలతో కూడిన సంసార దుఃఖాలను నిర్మూలిస్తూ ముల్లోకాల చేతనూ గురువుగా కొలువబడే శ్రీ దక్షిణామూర్తికి నమస్కృతులు.

మఱ్ఱి చెట్టు సమీపంలో నేలమీద కూర్చొని, తన దగ్గరకు వచ్చిన ముని గణాలకు జ్ఞాన బోధ చేసేవాడు, 3 లోకాలకు గురువు, ప్రభువు అయిన వాడు, జనన మరణ దుఃఖాలను పోగొట్ట గలిగినవాడు అయిన పరమాత్మ దక్షిణామూర్తికి నమస్కారము.

03. చిత్రం వటతరోర్మూలే వృద్ధాః శిష్యా గురుర్ యువా।
గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు చ్ఛిన్నసంశయాః॥

(ఆహా! ఎంత ఆశ్చర్యకరం! యువకుడైన గురువుచుట్టూ వృద్ధులైన శిష్యులు శ్రద్ధాభక్తులతో కూర్చొని ఉన్నారు. గురువు తన మౌనంతోనే వారి సందేహాలను నివారింప గలుగుతున్నాడు.)

ఆహా! ఏమి ఆశ్చర్యకరం! యువకుడైన గురువు చుట్టూ వృద్ధులైన శిష్యులు శ్రద్ధాభక్తులతో కూర్చొని ఉన్నారు. గురువు తన మౌనంతోనే వారి సర్వ సందేహాలనూ నివారింపగలుగుతున్నాడు.

ఆశ్చర్యం! వటవృక్షం యొక్క మొదట్లో కూర్చున్న శిష్యులు వృద్ధులు. గురువేమో యువకుడు. గురువు తన మౌనంతోనే శిష్యుల యొక్క సర్వ సందేహాలు తీరుస్తాడు.

04. ఓం నమః ప్రణవార్థాయ శుద్ధజ్ఞానైక మూర్తయే।
నిర్మలాయ ప్రశాంతాయ దక్షిణమూర్తయే నమః॥

(నిత్యశుద్ధుడై, ప్రశాంతస్వరూపుడై, శుద్ధజ్ఞానమే మూర్తిగా, ప్రణవనాదమైన ఓంకారానికి లక్ష్యార్థంగా భావిస్తూ, నిర్మలుడైన దక్షిణామూర్తికి నమస్కృతులు.)

ప్రసన్నస్వరూపుడై, శుద్ధజ్ఞానమే మూర్తిగా, ప్రణవనాదమైన ఓంకారానికి లక్ష్యార్థంగా భాసిస్తూ నిర్మలుడైన దక్షిణామూర్తికి నమస్కృతులు.

ఓంకార రూపునికి నమస్కారము. ఓం కారానికి అర్థమైనవాడు, ఏకమైన శుద్ధ జ్ఞాన స్వరూపుడు, మాలిన్య రహితుడు, పరిపూర్ణ శాంతి స్వరూపుడు అయిన దక్షిణామూర్తికి నమస్కారము.

05. గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్ పరం బ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః॥

06. నిధయే సర్వవిద్యానాం భిషజే భవరోగిణామ్।
గురవే సర్వలోకానాం దక్షిణామూర్తయే నమః॥

(భవరోగ బాధితులకు వైద్యుడై జగద్గురువై, జ్ఞాన స్వరూపంగా ప్రకాశించే దక్షిణామూర్తికి నమస్కృతులు.)

భవరోగ రోగులకు వైద్యుడై జగద్గురువై, సర్వవిద్యలకు నిధియై, సమస్త లోకములకు గురువైన దక్షిణామూర్తికి నమస్కృతులు.

అన్ని విద్యలకు నిధి, భవ రోగాలకు వైద్యుడు, అందరికీ గురువు అయిన దక్షిణామూర్తికి నమస్కారము.

07. చిదోఘనాయ మహేశాయ వటమూలనివాసినే।
సచ్చిదానంద రూపాయ దక్షిణామూర్తయే నమః॥

08. ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే।
వ్యోమవద్ వ్యాప్తదేహాయ దక్షిణామూర్తయే నమః॥

09. అంగుష్ఠతర్జనీయోగముద్రా వ్యాజేనయోగినామ్।
శృత్యర్థం బ్రహ్మజీవైక్యం దర్శయన్యోగతా శివః॥

- - -

శ్రీ దక్షిణామూర్తి అష్టకం లో ఉన్న మొత్తం 10 శ్లోకాలలో మొదటి 3 శ్లోకాలు ఈ జగత్తును గురించి, తరువాత 3 శ్లోకాలు చూచేవాడిని గురించి, ఆ పై 3 శ్లోకాలు చూపించే ప్రకాశం గురించి, చివరి శ్లోకం అంతా తన్మయమే - పరమాత్మే అని తెలియజేస్తాయి.

- - -

01. విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ తుల్యం నిజాంతర్గతం।
పశ్యన్నాత్మని మాయయా బహిరివో ద్భూతం యథా నిద్రయా।
యః సాక్షాత్ కురుతే ప్రబోధ సమయే స్వాత్మాన మేవాద్వయం।
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

01. నిద్రించువాడు తన ఊహాత్మకమైన దృశ్యమునే కలలో చూచుచూ, మేల్కొన్న పిదప అదంతయూ నిజముకాదని, తనయందే ఉన్నదని తెలుసుకొను నట్లుగా ఏపరబ్రహ్మ తనయందే ఇమిడి ఉన్న ప్రపంచమును అద్దములో కనబడు దృశ్యము వలే తన మాయాశక్తిచే వెలుపల చూచుచూ జ్ఞానోదయమైన పిదప అదంతయూ తానే అని తెలుసుకొనునో అట్టి గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

(నామరూపాత్మకమైన ఈ సర్వజగతినీ, ఆత్మచైతన్యమైన తనలో లీలామాత్రంగా, స్వానుభవంగా, స్వాత్మగా, అద్దంలో కనిపించే నగరం వలె,

స్వప్నదృశ్యం వలె తనకంటే భిన్నంగా ఉందన్న భ్రమకలిగిస్తోందని గుర్తిస్తున్న జగద్గురువైన శ్రీ దక్షిణామూర్తికి నా నమోవాకాలు).

ఎవరు ఈ సమస్త జగత్తును అద్దంలో కనిపించే నగరం లాగా, స్వప్నంలో కనిపించే దృశ్యంలాగా, ఆత్మ చైతన్యమైన తనలోనే ఉన్నా, తనకన్నా వేరుగా బయట ఉన్నట్లు భ్రమపడుతూ, ఆత్మానుభూతిని పొందినప్పుడు అంతా ఒకటే అయిన తన స్వరూపంగా (ఆత్మగా) సాక్షాత్కరించుకుంటారో అట్టి గురుమూర్తి అయిన దక్షిణామూర్తికి ఇదిగో పమస్కారము.

(గురువును పరమాత్మకు అభిన్నంగా ఎలా భావించి సేవ చేయాలో ఈ దక్షిణామూర్తి స్తోత్రం మనకు తెలియ జేస్తున్నది)

02. బీజస్యాంత రివాంకురో జగదిదం ప్రాజ్ నిర్వికల్పం పునః
మాయాకల్పిత దేశకాలకలనా వైచిత్ర్య చిత్రీకృతమ్।
మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవ యః స్వేచ్ఛయా
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

02. విత్తనములోని మొలకవలే సృష్టికి ముందు ప్రపంచమంతయూ జాతి – గుణ – క్రియల భేదము లేనిదిగా ఉండెను. పిదప సృష్టి సమయమున పరమాత్మని మాయశక్తిచే వివిధదేశములు – వివిధకాలములు ఏర్పడినవి. గారడివాని వలే ఈ ప్రపంచమును నిర్మించుచూ, మహాయోగివలే తనకిష్టమైనట్లు మార్చుచున్న గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

(విత్తనంలో మహావృక్షం దాగి ఉన్నట్టుగా గోచరించే ఈ మహావిశ్వమంతా, దేశకాలావృతమైన సమస్త చరాచర జగతినీ, ఇంద్రజాలికునివలె, మహాయోగివలె, బహిర్గతం చేసి తన మాయాశక్తితో స్వేచ్ఛగా జగన్నాటకాన్ని నడిపే మహాత్ముడైన నా గురువునకు, శ్రీ దక్షిణామూర్తికి నా నమోవాకములు.)

విత్తనంలో మొలకలాగ ఈ జగత్తంతా సృష్టికి ముందు ఏ మార్పులు లేకుండా ఉన్నది. మాయచేత కల్పించబడిన దేశకాల భేదం వలన చిత్రంగా సృష్టింపబడింది జగత్తు. ఇంద్రజాలకునిలాగా, యోగిలాగా ఎవరు తన సంకల్పముతో ఈ జగత్తును విజృంభింప చేస్తున్నారో అట్టి గురుమూర్తి దక్షిణామూర్తికి నా నమస్కారములు.

03. యస్యైవ స్ఫురణం సదాత్మక మసత్–కల్పార్థ(క)గం భాసతే
సాక్షాత్–తత్వమసీతి వేదవచసా యో బోధ యత్యా శ్రితాన్।
యత్సా(స్సా)క్షాత్–కరణాద్భవేన్న పునరావృత్తిర్ భవాంభోనిధౌ
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

03. సత్యస్వరూపుడైన ఏ పరమాత్మ స్వరూపము ప్రాపంచిక వస్తువులందు కనబడుచున్నదో, ఏ పరమాత్మ "తత్వమసి" మొదలగు వేదవాక్యములచే తన భక్తులకు బోధించుచున్నాడో, ఏ పరమాత్మ సాక్షాత్కారమువలన సంసార సాగరమునందు పునర్జన్మ కలుగదో అట్టి గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

(ఎవని వ్యక్తరూపం ఈ ప్రపంచంగా స్ఫురిస్తూ కూడా నిత్యసత్యమై ప్రకాశిస్తూ ఉంటుందో, శ్రద్ధలో శరణువేడినవారికి తత్త్వమస్యాది మహావాక్యాలతో ఎవరు జ్ఞానబోధ చూస్తుంటారో, ఎవరి జ్ఞానబోధవల్ల జననమరణయుక్తమైన ఈ సంసార చక్రం నుండి ముక్తి పొందుతున్నారో, అట్టి పరమ పవిత్రమైన గురుమూర్తికి, శ్రీ దక్షిణామూర్తికి నా నమస్కారములు.)

ఏ పరమాత్మ యొక్క సద్రూప చైతన్యం అసద్రూప జగత్తుగా ప్రకాశిస్తుందో, ఏ పరమాత్మ ఆశ్రితులైన వారికి 'తత్త్వమసి' అనే వేదవాక్కుల ద్వారా అపరోక్షంగా బోధిస్తున్నాడో, ఏ పరమాత్మ సాక్షాత్కారము వల్ల జనన మరణాలతో కూడిన ఈ సంసార సాగరము నందు తిరిగి ప్రవేశం లేకుండా ముక్తి కలుగుతుందో అట్టి గురుమూర్తి దక్షిణామూర్తికి నా నమస్కారములు.

04. నానాచ్ఛిద్ర ఘటోదర స్థిత మహాదీప ప్రభాభాస్వరం
జ్ఞానం యస్య తు చక్షురాదికరణ ద్వారా బహిః స్పందతే।
జానామీతి తమేవ భాంత మనుభాత్-యేతత్-సమస్తం జగత్
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

04. అనేకములైన చిల్లులుగల కుండయందలి దీపపుకాంతి బయటకు ప్రసరించునట్లుగా ఏ పరమాత్ముని జ్ఞానము, కన్నులు మొదలగు ఇంద్రియముల ద్వారా బయటకు వెలువడుచున్నదో, ప్రకాశించుచున్న ఏపరమాత్ముని తెలుసుకొని ఈ ప్రపంచమంతయూ అనుసరించి ప్రకాశించున్నదో అట్టి గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

(ఎవని చైతన్యం, మన కళ్ళు చెవులు మొదలైన ఇంద్రియాలద్వారా, అనేక చిల్లులు కలిగిన కుండలో ఉన్న దీపకిరణాలవలె, పైకి ప్రసరిస్తూ ఉందో, ఏ చైతన్యం ప్రకాశించడం వలన ఈ వస్తుమయ మహా ప్రపంచం అంతా తెలియబుతూ ఉందో ... అటువంటి దివ్యమూర్తికి, సద్గురువుకు, శ్రీ దక్షిణామూర్తికి నా నమోవాకాలు.)

అనేక చిల్లులు గల కుండలోని దీపం అన్నివైపులా కిరణాలను ప్రసరింపచేసినట్లు కళ్ళు మొదలైన ఇంద్రియాల ద్వారా ఎవరి చైతన్యం బయటకు ప్రకాశిస్తూ ఉంటుందో; అట్టి స్వయంప్రకాశ పరమాత్మయే ఈ జగత్తు నంతటిని ప్రకాశింప చేస్తున్నాడు. అట్టి గురుమూర్తి దక్షిణామూర్తికి ఇవే నా నమస్కారములు.

05. దేహం ప్రాణ మపీంద్రియాణ్యపి చలాం బుద్ధిం చ
శూన్యం విదుః
స్త్రీ బాలాంధ జడోపమాస్త్వహ మితి భ్రాంతా
భృశం వాదినః।

మాయాశక్తి విలాసకల్పిత మహావ్యామోహ సంహారిణే
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

05. స్త్రీలు - బాలురు - గ్రుడ్డివారు - మూర్ఖులతో సమానులైన ఇతర మతముల వారు, శరీరము - ప్రాణములు - చంచలమైన బుద్ధి - శూన్యము అను వాటిని ఆత్మగా భావించుచున్నారు. మాయాశక్తిచే ఏర్పడు అజ్ఞానమును తొలగించు గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

(బుద్ధిపరంగా స్త్రీలవలె, చిన్నపిల్లలవలె, మూఢులవలె, విషయాల నర్థం చేసుకొనే శక్తిహీనులు, మాయాప్రభావానికి లోనై, శరీరమే సత్యమనీ, ప్రాణమే సత్యమనీ, ఇంద్రియాలనే సత్యమనీ, మనస్సే సత్యమనీ, నిత్యమూ మార్పు చెందే బుద్ధే సత్యమనీ, శూన్యమే సత్యమనీ, శాస్త్రం నుండి తప్పుగా గ్రహిస్తారో; అట్టివారి భ్రమలను తొలగించగలిగే పరమగురువుకు, శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా ప్రణామాలు.)

భ్రాంతి చేత నేను దేహాన్నని, ప్రాణాన్నని, ఇంద్రియాలనని, చలించే బుద్ధినని, శూన్యాన్నని గట్టిగా వాదించేవారు బుద్ధి పరంగా స్త్రీల వంటి, బాలురవంటి, అంధులవంటి, మందబుద్ధులతో సమానమైనవారు. మాయా శక్తి యొక్క లీలా విలాసంచేత కల్పించబడ్డ ఈ గొప్ప అజ్ఞానాంధకారాన్ని సమూలంగా పోగొట్టగలిగే పరమ గురువు శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా నమస్కారములు.

06. రాహుగ్రస్త దివాకరేందు సదృశో మాయా సమాచ్ఛాదనాత్
సన్మాత్రః కరణోప సంహరణతో
యోఽ భూత్-సుషుప్తః పుమాన్
ప్రాగస్వాప్సమితి ప్రబోధసమయే యః ప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

06. రాహువుచే కబళించబడు సూర్యచంద్రులవలే ఏ పురుషుడు మాయాశక్తి ఆవరించుటవలన సత్తామాత్రుడై ఇంద్రియములను ఉపసంహరించుకొని అజ్ఞానమను గాఢనిద్రను పొందునో, మెలకువ కలుగగా పూర్వము నిద్రపోయితినని తెలుసుకొనునో అట్టి గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

(గ్రహణ సమయంలో సూర్యచంద్రులు రాహువుచే కప్పబడినట్లుగా సర్వేంద్రియ వ్యవహారాలు ఉపశమించి సుషుప్తి అవస్థలో ప్రవేశించి మాయావరణతో కూడిన సత్యం సన్నిధిలో విశ్రాంతినొంది మళ్ళీ మెలకువలో తాను నిద్ర పోయినట్లుగా తెలుసుకునే పరమ సత్యానికి, శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా ప్రణామములు.)

గ్రహణ సమయంలో సూర్యచంద్రులు రాహువు చేత కప్పబడినట్లుగా ఇంద్రియ వ్యాపారాలన్నీ ఉపసంహరించబడిన సుషుప్తిలో ఏ పురుషుడు (ఆత్మ) మాయ కప్పివేయడం వల్ల సత్తామాత్రంగా గోచరిస్తూ, తిరిగి నిద్రనుండి మేలుకొన్న సమయంలో ఇంతకుముందు నిద్రించాను అనే స్పృహకలిగి వుంటాడో అట్టి పరమ గురువు శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా నమస్కారములు.

07. బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వా స్వవస్థాస్వపి
వ్యావృత్తా స్వను వర్తమాన మహమిత్యంతః స్ఫురంతం సదా।
స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం యో ముద్రయా భద్రయా
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

07. బాల్యము మొదలైనవి - మెలకువ మొదలైనవి అగు అన్ని దశలు వచ్చి పోవుచుండగా వాటి ననుసరించి "నేను" అని ఎల్లప్పుడు లోపల ప్రకాశించుచున్న ఆత్మ స్వరూపమును మంగళకరమైన జ్ఞానముద్రచే తన భక్తులకు బోధించు గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

(బాల్య కౌమార్య యౌవన వృద్ధాప్య దశలలోనూ, జాగ్రత్ స్వప్న సుషుప్తి మొదలైన అన్ని అవస్థలలోనూ భూత వర్తమాన భవిష్యత్ కాలాలలోనూ, సర్వదా

అన్ని ప్రాణులలోనూ 'నేను'గా ఉంటూ, తన భక్తులకు చిన్ముద్ర ద్వారా తన నిజ తత్త్వాన్ని వ్యక్తం చేసే సద్గురుమూర్తి శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా ప్రణామాలు).

బాల్యం, కౌమారం, యవ్వనం, వార్థక్యం అనే అవస్థలు; జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే అవస్థలు; అలాగే దర్శన, స్పర్శనాది అన్ని అవస్థలూ మారి పోతుండగా; మార్పు లేకుండా అన్ని అవస్థల యందు నేను నేను అంటూ కేవలం సాక్షిగా ప్రకాశిస్తూ ఉన్న ఏ ఆత్మ స్వరూపం కలదో; ఆ ఆత్మ స్వరూపాన్ని భక్తులకు చిన్ముద్ర చేత ప్రకటిస్తున్న పరమ గురువు శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా నమస్కారములు.

08. విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామి సంబంధతః
శి(ష్య)ష్యాచార్యతయా తథైవ పితృ పుత్రాద్యాత్మనా భేదతః।
స్వప్నే జాగ్రతి వా య ఏ ష పురుషో మాయా పరిభ్రామితః
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

08. కలయందు – మెలుకువయందు మాయాశక్తిచే భ్రాంతినిపొంది విశ్వరూపుడైన తననే -- – కార్యము – కారణముగాను, సేవకుడు – యజమానిగాను, శిష్యుడు – గురువుగాను, తండ్రి – పుత్రుడుగాను ఇంకా అనేక బేధములతో చూచుచున్న గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

(ఏ పురుషుడు మాయా ప్రభావంతో తనలో -- కార్యకారణ సంబంధ రూపమయిన విశ్వాన్నీ, శిష్యాచార్య విభేదాన్నీ, పితృపుత్ర మొదలయిన తేడాలనీ జాగ్రత్ స్వప్నావస్థలనీ చూస్తున్నాడో, ఆయనకు, ఆ పరమగురువుకి, శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా ప్రణామములు).

ఏ పురుషుడు మాయా ప్రభావం చేత స్వప్నము నందు గానీ, జాగ్రత్ నందు గానీ ఈ జగత్తును కార్యకారణ సంబంధముచేతగానీ, యజమానీ సేవక సంబంధము చేతగానీ, శిష్యుడు – ఆచార్యుడు అనే సంబంధము చేతగానీ, అలాగే తండ్రి – కొడుకు అనే సంబంధము చేతగానీ తనలోనే అనేక భేదాలను చూస్నున్నాడో అట్టి పరమ గురువు శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా మనస్కారములు.

09. భూరంభాంస్య నలోఽ నిలోఽ oబర మహర్నాథో
హిమాంశుః పుమాన్
ఇత్యాభాతి చరాచరాత్మక మిదం యస్యైవ మూర్త్యష్టకమ్।
నాన్యత్కించన విద్యతే విమృశతాం యస్మాత్ పరస్మాద్-విభోః
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

09. భూమి - జలము - అగ్ని - వాయువు - ఆకాశము - సూర్యుడు - చంద్రుడు - జీవుడు అని ఎనిమిది రూపాలుగా ఈ చరాచర ప్రపంచమంతయూ నిండి వెలుగొందుచున్నవాడు, సర్వవ్యాపియైన తనకంటే ఇతరమైనదేదీ లేదని, విమర్శకులకు తెలియబరచువాడు అగు గురుమూర్తియైన దక్షిణామూర్తికి నమస్కారము.

(ఎవని అష్టమూర్తులు భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, జీవుడుగా విరాజిల్లుతున్నారో, ఎవరు చరాచరమయిన జగత్తుగా వ్యక్తమవుతున్నాడో, ఎవనిని ఆరాధించి సర్వవ్యాప్తమయిన ఆత్మతత్వంకంటే వేరుగా రెండవదేదీ లేదని సాధకులు తెలుసుకుంటున్నారో ... అట్టి సద్గురువునకు, శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా ప్రణామాలు).

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, జీవుడు అనేవి ఎవరి యొక్క అష్టమూర్తులో; ఎవరు ఈ చరాచరాత్మకమైన జగత్తుగా భాసిస్తూ ఉన్నారో, ఎవరిని ఆరాధించి సర్వ వ్యాపకమైన ఆత్మచైతన్యం కన్నా వేరుగా రెండవదేదీ లేదని జ్ఞానులు తెలుసుకుంటున్నారో, అట్టి పరమ గురువు శ్రీ దక్షిణామూర్తికి ఇవే నీ నమస్కారములు.

ఫలశ్రుతి:

10. సర్వాత్మత్వ మితి స్ఫుటీకృత మిదం యస్మాదముష్మిన్ స్తవే
తేనాస్య శ్రవణాత్ తదర్థ మననాద్ ధ్యానాచ్చ సంకీర్తనాత్।

సర్వాత్మత్వ మహావిభూతి సహితం స్యాదీశ్వరత్వం స్వతః
సిద్ధ్యేత్-తత్పునరష్టధా పరిణతం చైశ్వర్య మవ్యాహతమ్॥

10. ఈ దక్షిణామూర్తి స్తోత్రమునందు అంతటా వ్యాపించిన ఆత్మ ఒక్కటే అని నిరూపించబడినది. ఈ స్తోత్రమును వినుటవలన - అర్థము తెలుసుకొనుట వలన - ధ్యానించుటవలన - చదువుటవలన - పరమాత్మ సాక్షాత్కారము కలుగును. అష్టైశ్వర్యములు లభించును.

(సర్వాత్మత్వం ఈ స్తుతిలో వివరించబడింది. కాబట్టి దీనిని విని, మననం చేసి, ధ్యానించి, కీర్తించడంలో అష్టవిభూతి సహితమయిన సర్వాత్మత్వం, ఈశ్వరత్వం, స్వరూపానుభూతి సిద్ధిస్తాయి.)

ఈ జగత్తంతా ఆత్మయేనని, ఈ స్తోత్రంలో చక్కగా చెప్పబడినది. అందువలన ఈ స్తోత్రాన్ని శ్రవణం చేసి, దాని అర్థాన్ని మననం చేసి ధ్యానము చేసి, సంకీర్తన చేసినట్లైతే సర్వాత్మత్వమనే గొప్ప సంపదతో కూడిన ఈశ్వరత్వం స్వయంగా సిద్ధిస్తుంది. ఆ ఈశ్వరత్వం సిద్ధించటం వల్ల అష్ట విధములైన సిద్ధులు నిరాఘాటంగా సిద్ధిస్తాయి.

// ఇతి శ్రీమచ్ఛంకరాచార్య విరచితం శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమ్ సంపూర్ణమ్ //

- - -

శ్లో॥ యస్యదేవే పరాభక్తిః యదా దేవే తథా గురౌ।
తస్యైతే కథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః॥

ఏవరైతే తన గురువును భగవంతుని వలే భావించి ఆరాధిస్తారో వారికి మాత్రమే ఈ శాస్త్ర సారం సరిగ్గా అర్థమవుతుంది. అత్యధిక ఫలితాన్ని పొంద గలుగుతారు.

- - -

2వ పేజీ తరువాయి...
వీరు నలుగురూ ఆ మూర్తిని చూసి, అతని తేజస్సుకు ఆకర్షితులై ఆయన చుట్టూ కూర్చున్నారు. శివుడు ఒక్క మాట కూడా మాట్లాడకుండా యోగ భంగిమ లోనే కూర్చున్నాడు. ఋషులందరికి అనుమానాలన్నీ వాటంతట అవే తొలగిపోయి జ్ఞాన వంతులయ్యారు. దక్షిణామూర్తి స్వామి వారు తమ మౌనంతోనే వారందరినీ బ్రహ్మజ్ఞానం పొందునట్లు చేసారు. అలా మౌనముగా ఎందుకు బోధించారంటే బ్రహ్మము లేక పరమాత్మ మాటలకు, మనసుకూ అందనివాడు కాబట్టి అలా బోధించారు.

ఇలాంటి యువకుడైన దక్షిణామూర్తి చుట్టూ వృద్ధులైన మునులు కూర్చుని ఉంటారట. గురువు చేసేది మౌనవ్యాఖ్యానం. మౌనంగా చిన్ముద్రలో కూర్చుని ఉండటమే అతడు చేసే వ్యాఖ్యానం.

దక్షిణామూర్తి పాదాలక్రింద ఉన్నది తమో గుణ రూపానికి ప్రతీక! వాటిని శివుడు తన కాలితో అదిమిపడుతాడు! దక్షిణామూర్తి కాలికింద ఉన్న రాక్షసుడు (తమోగుణం) ఆనందంగా ఉండటం! అజ్ఞానాన్ని అదుపు చేసేవాడే శ్రీ దక్షిణామూర్తి. ఈ తత్వమే ఆదిగురుతత్వం. దక్షిణామూర్తి ఆది గురువు. ఆది యోగి అన్నమాట. ఆయన సమస్త జ్ఞానానికి మూలం.! ఈ తత్వాన్ని తెలుసుకోవటమంటే - జ్ఞానం, ఎరుక అనే అవగాహన కలిగివుండటమే! పరమశివుని ఈ రూపం సంగీత - సాహిత్యాల, యోగ - తాంత్రిక విద్యల కలయిక. సకల శాస్త్రాల సారాన్ని తెలిసి, అర్హులైన మహర్షులకు ఉపదేశం చేసినవాడే శ్రీ దక్షిణామూర్తి. సద్గురువు లభించని ఉత్తములు ఈయన్ని గురువుగా భావించి జ్ఞానాన్ని మోక్షాన్ని పొందవచ్చు.

గురువే సర్వలోకానాం భిషజే భవరోగినాం
నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తయే నమః

సర్వలోకాలకు గురువు. భవరోగులకు (సంసార బంధాలలో చిక్కుకు పోయిన వాళ్ళకు) వైద్యుడు, సకల విద్యలకు నెలవు (నివాసం) అయిన దక్షిణామూర్తికి నమస్కరిస్తున్నాను.

- - - = - - -

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

